క్లుప్తంగా

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈవో

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి విరాళం అందింది. ఈ విరాళాన్ని తెలంగాణలోని మదీనాగూడకు చెందిన జయంతి వెంకట సూర్యనారాయణమూర్తి కుటుంబ సభ్యులు రూ.47,500 అందించినట్లు ఆలయ ఈఓ నల్లం చక్రధరరావు తెలిపారు.

మలికిపురం ఎంపీడీఓగా బాలాజీ

మలికిపురం: మండల నూతన ఎంపీడీవోగా నిమ్మగడ్డ బాలాజీ బాధ్యతలు నిర్వహించారు. ఇప్పటి వరకూ ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహించిన బి.మంగాదేవి అమలాపురం బదిలీ అయ్యారు. రాజోలు నుంచి బదిలీపై వచ్చిన మలికిపురం ఎంపీడీఓ నిమ్మగడ్డ బాలాజీని ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, మేడిచర్ల రాము, వైస్ ఎంపీపీ సుందర శ్రీను తదితరులు అభినందించారు. మండలంలోని వివిధ అధికారులు గొల్లమందల మిల్టన్, సచివాలయ ఉద్యోగులు ఎంపీడీఓను మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈఓపీఆర్డీగా రాజు బాధ్యతల స్వీకరణ



ఆలమూరు: మండల ఈఓపీఆర్‌డీగా ఎ.రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా మండపేట నుంచి ఆయన ఆలమూరుకు బదిలీపై వచ్చారు. మండపేటలో ఈఓపీఆర్డీ విధులతో పాటు కొన్ని నెలల పాటు ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేసి ప్రజల మన్ననలు అందుకున్నారు. ఆలమూరులో ఈఓపీఆర్డీగా పనిచేసిన పీఆర్‌సీ రాజకుమార్ ఉప్పలగుప్తం మండలానికి బదిలీపై వెళ్లారు. ఆలమూరు ఈఓపీఆర్‌డీగా బాధ్యతలు స్వీకరించిన రాజును ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎస్.వీర్రాజు, కె.మోక్షాంజలి, విజయారెడ్డి, సీహెచ్ వీరమాత, జె.అయ్యన్న, వి.వేణి, జూనియర్ అసిస్టెంట్ ఎస్‌కే వలీ అభినందించారు.

వీరవల్లిపాలెం పంచాయతీ కార్యదర్శిగా బులివీరన్న

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెం పంచాయతీ కార్యదర్శిగా కె.బులివీరన్న బుధవారం విధులు స్వీకరించారు. బులివీరన్న కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి బదిలీల్లో భాగంగా వీరవల్లిపాలెం గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా చేరారు. గ్రామ సర్పంచ్ సలాది బుచ్చిరాజు, ఎంపీటీసీ సభ్యుడు, వైస్ ఎంపీపీ అడపా నాగభూషణం, పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఆయనను అభినందించారు. గ్రామ సమస్యలను గుర్తించి సత్వరం పరిష్కరిస్తానని ఆయన తెలిపారు.

ప్రిన్సిపల్ శాస్త్రవేత్తగా మమత



అంబాజీపేట: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన(కొబ్బరి) పరిశోధన కేంద్రంలో డాక్టర్ ఎం.మమత బుధవారం ఉద్యాన విభాగంలో ప్రిన్సిపల్ శాస్త్రవేత్తగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ విషయాన్ని పరిశోధన కేంద్ర అధిపతి డా.ఎన్‌బీవీ చలపతి రావు తెలిపారు. గతంలో మమత ఆముదాలవలసలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఆరేళ్లు, కొవ్వూరులో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా కేంద్రం, అఖిల భారత దుంప పంటల సమన్వయ పథకంలో 16 ఏళ్లు, సేవలందించారని చలపతిరావు పేర్కొన్నారు. కొవ్వూరులో పనిచేసిన సందర్భంలో దుంప పంటలపై దేశంలోనే ప్లాంట్ మెటీరియల్ ప్రొడక్షన్‌లో రెండు సార్లు ఉత్తమ శాస్త్రవేత్తగా అవార్డులు అందుకున్నారన్నారు. కొబ్బరిలో శాస్త్రీయ పరిశోధనలకు కూడా మమత సేవలను వినియోగించుకుంటామని చలపతి రావు తెలిపారు.

సభ్యత్వాల నమోదు వేగవంతం చేయాలి

మలికిపురం: రాజోలు నియోజకవర్గ బీజేపీ సమావేశం కేశనపల్లిలో నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు సభ్యత్వ ప్రముఖ్ వేటుకూరి సూర్యనారాయణ రాజు పాల్గొని మాట్లాడుతూ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని, మండలానికి కనీసం పదివేల సభ్యత్వం చేసే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా సభ్యత్వ ప్రముఖ్ పాలూరు సత్యానందం, జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసు నగేష్, డ్రైనేజీ సెల్ రాష్ట్ర కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు మండల పార్టీ అధ్యక్షులు కాపిశెట్టి కనికేశ్వరరావు, పట్టపు సూర్యప్రకాశరావు, మెండ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై స్పందించేవారేరీ?



నగరం విద్యుత్ సబ్‌స్టేషన్

- తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం
- ఓవర్ లోడుతో సమస్యలు
- పట్టించుకోని అధికారులు

మామిడికుదురు: విద్యుత్ సరఫరాలో తరచూ ఏర్పడుతున్న సాంకేతిక పరమైన సమస్యలు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. తరచూ విద్యుత్ ట్రిప్ కావడం, గంటల తరబడి సరఫరా నిలిచిపోవడం, ఆఫ్ అండ్ డౌన్ వంటి సమస్యలతో మామిడికుదురు మండలంలోని 18 గ్రామాలకు చెందిన వినియోగదారులు తీవ్రంగా సతమతమవుతున్నారు. కాలంతో సంబంధం లేకుండా ప్రతి నిత్యం ఏదో ఒక సమస్య ఎదురవుతూనే ఉంది. ఇక వేసవిలో అయితే సమస్య మరింత జటిలంగా మారుతుందని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఉన్న రెండు సబ్ స్టేషన్లపై ఓవర్ లోడ్ కారణంగా తీవ్ర ఒత్తిడి ఏర్పడి సమస్యలు ఏర్పడుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

సబ్ స్టేషన్ల కెపాసిటీ పెంచాలి

నగరం విద్యుత్ సబ్ స్టేషన్ ప్రస్తుత కెపాసిటీ కేవలం పది మెగావాట్లు మాత్రమే. అయిదేసి మెగావాట్ల వంతున 10 మెగావాట్ల సామర్థ్యంతో ఇక్కడ రెండు ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉన్నాయి. ఈ సబ్ స్టేషన్ పరిధిలో మొత్తం 23 వేలు పైబడి విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇక్కడ అదనంగా మరో మూడు మెగావాట్ల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఇక్కడ ప్రస్తుతం ఉన్న రెండు అయిదు మెగా వాట్ల ట్రాన్స్‌ఫార్మర్లలో ఒకదాని కెపాసిటీ ఎనిమిది మెగావాట్లకు పెంచాల్సి ఉందని చెబుతున్నారు. దీనికి గాను రూ.కోటి పైబడి ఖర్చవుతుందని అంచనా. నిధుల సమస్యతో ఇది ప్రతిపాదనల దశలోనే మురిగిపోయిందని చెబుతున్నారు. మగటపల్లిలో ప్రస్తుతం అయిదు మెగావాట్లతో ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులో ఉంది. ఇక్కడ అదనంగా మరో అయిదు మెగావాట్ల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. దీనికి సంబంధించిన పనులన్నీ పూర్తి చేశారు. ఇక ట్రాన్స్‌ఫార్మర్ రావడమే తరువాయి అని పేర్కొంటున్నారు. ఈ మండలం రాజోలు. పి.గన్నవరం నియోజవర్గాల పరిధిలో ఉంది. ఇద్దరు ఎమ్మెల్యేలు దేవ వరప్రసాద్, గిడ్డి సత్యనారాయణ దీనిపై దృష్టి సారించి ఇక్కడ నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

తరచూ విద్యుత్ అంతరాయం



ప్రతి రోజు విద్యుత్ సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నాయి. లో-ఓల్టేజ్ సమస్యతో పాటు తరచూ అప్ అండ్ డౌన్ వంటి ఇతర సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం. తరచూ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారు. చాలా కాలంగా ఈ సమస్య వేధిస్తోంది. చీకటి పడిదంటే చాలు లో-ఓల్టేజ్‌తో ఇబ్బంది పడుతున్నాం. ఈ సమస్యల పరిష్కారం దిశగా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

– యేడిద లక్ష్మణరావు, పెదపట్నం

లోవోల్టేజీతో తీవ్ర ఇబ్బందులు



విద్యుత్ సమస్యలు ప్రతి రోజూ వేధిస్తున్నాయి. రాత్రి అయిందంటే చాలు లో-ఓల్టేజ్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మిణుకు మిణుకు మంటూ లైట్లు వెలుగుతున్నాయి. వర్షాకాలంలోనూ ఇవే సమస్యలు. విద్యుత్ సమస్యలతో ప్రతి రోజు అవస్థలే. ఎప్పుడు కరెంటు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. ఈ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా పాలకులు, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పాలమూరి గోపాల్, పాశర్లపూడిలంక

పోరాట యోధుడు జక్కంపూడి



మామిడికుదురులో జక్కంపూడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరిదేవి

మామిడికుదురు: ప్రజా సమస్యలపై జక్కంపూడి రామ్మోహనరావు అలుపెరగని పోరాటం చేసిన పోరాట యోధుడని మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి శ్లాఘించారు. జక్కంపూడి వర్ధంతి సందర్భంగా బుధవారం మామిడికుదురులో అతని చిత్రపటానికి వైఎస్సార్ సీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జక్కంపూడి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, బొలిశెట్టి భగవాన్, పార్టీ నేతలు కటకంశెట్టి ఆదిత్య, జక్కంపూడి వాసు, తోరం భాస్కర్, నెల్లి దుర్గాప్రసాద్, సూరిశెట్టి బాబి, తులా గోపాలకృష్ణ, కుసుమ శ్రీను, నయనాల సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు బడుగు బలహీన వర్గాలకు అందించిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్ అన్నారు. స్థానిక అక్విడెక్ట్ పార్కులో సాయిరామ్ ఆధ్వర్యంలో బుధవారం జక్కంపూడి వర్ధంతి నిర్వహించారు. జక్కంపూడి విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు నూకపెయ్యి రాజేంద్రప్రసాద్, కోట ఏడుకొండలు, తాటికాయల మధుబాబు, బోడపాటి సాయిబాబు, అడ్డగళ్ల రాంబాబు, అరిగెల జయదీప్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షతన గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని, పలు ప్రాంతాల్లో స్తంభాల నుంచి కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లను మార్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ పనుల వివరాలను తనకు తెలియజేస్తే, వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానని అన్నారు. అలాగే ఎక్కడ అంగన్‌వాడీ భవనాలను నిర్మించాలో తనకు వివరాలు అందజేయాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 14 నుంచి జరగనున్న పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ నిధులు, ఉపాధి హామీ పథకం నిధులు రూ.5.49 కోట్లతో వివిధ పనులు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజా ప్రతినిధులు కోరారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీపల్లవి, ఎంపీడీఓ కేవీ ప్రసాద్, మండల ఉపాధ్యక్షురాలు సీహెచ్ గంగాదేవి, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ఆదిమూలం సూరయ్యకాపు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల దరఖాస్తులకు గడువు పెంపు

ఆలమూరు: మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకునేందుకు రెండు రోజుల పాటు గడువు పెంచినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఐడీ నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఆవరణలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల తొమ్మిదిన ముగియ వలసిన దరఖాస్తుల ప్రక్రియ 11న రాత్రి ఏడుగంటల వరకూ పొడిగించారన్నారు. 12, 13 తేదీల్లో దరఖాస్తుల పరిశీలన జరుగుతుందన్నారు. అలాగే లాటరీ పద్ధతిపై అధికారులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈనెల 14న లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలను కేటాయిస్తామన్నారు. మద్యం దుకాణాను దక్కించుకున్న వ్యాపారులకు అదే రోజు మంజూరు పత్రాలను అందజేయనున్నట్లు సీఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు.

రికార్డు స్థాయిలో దరఖాస్తులు

ఆలమూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ పరిధిలో బుధవారం సాయంకాలానికి 300 దరఖాస్తులు అందినట్లు సీఐ తెలిపారు. సర్కిల్ పరిధిలోని ఆలమూరు, కపిలేశ్వరపురం, మండపేట, మండపేట రూరల్ మండలాల్లో 20 మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఆలమూరులో 101, కపిలేశ్వరపురంలో 53, మండపేట పట్టణంలో 57, మండపేట రూరల్‌లో 89 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు

పి.గన్నవరం: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా నాగుల్లంక పీహెచ్‌సీలో వైద్యాధికారులు వైవీ ప్రియాంక, ఆర్.మౌనికల ఆధ్వర్యంలో 39 మంది గర్భిణులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బోళ్ల వీరాస్వామి సత్రం ఆధ్వర్యంలో వారికి పౌష్టికాహారం అందజేశారు. ఎంపీహెచ్ఈఓ ఎ.నాగరాజు, హెచ్‌ఎస్‌లు బీవీవీఎస్ఎన్ మూర్తి, కేసీహెచ్ మరియమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే పి.గన్నవరం సీహెచ్‌సీలో పలువురు గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. వై.కొత్తపల్లికి చెందిన వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగా ఈశ్వరరావు ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు శిరీష, రాబిన్, హెచ్‌ఎస్ కుమారి, నాయకులు నల్లా పెదకాపు, తోరం సింహాచలం, కొర్లపాటి రాజేష్, తోలేటి పార్థసారథి, రావూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

సఖినేటిపల్లి: గొంది, గుడిమూల గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్‌లు దొండపాటి రవికుమార్, దెందుకూరి శ్రీహరిరాజు అధ్యక్షతన రైతులతో సమావేశాలు నిర్వహించారు. వరి పంటపై ఆశించే తెగుళ్లు, వాటి నివారణ, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందుటకు విధి విధానాలపై ఏవో పీవీ నరసింహారావు వివరించారు. అలాగే నెలాఖరుకు కేజీ ఒక్కంటికీ రూ.5 సబ్సిడీపై దాళ్వా వరి విత్తనాలు ఎంటీయూ 1121 రకం రానున్నట్టు కూడా చెప్పారు. ఉద్యాన శాఖ అధికారి దుర్గారావు మాట్లాడుతూ, తమ శాఖ ద్వారా రైతులకు అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ఆయా గ్రామాల్లో రైతులతో కలసి ప్రజాప్రతినిధులు, అధికారులు ర్యాలీ చేశారు. డాక్టర్ రుద్రరాజు పద్మరాజు, మేడిది రత్నరాజు, కె.సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులాల కేటాయింపు

ఆలమూరు: మండలంలో అర్హులైన రైతులందరికీ పారదర్శకంగా మినీ గోకులాలు కేటాయిస్తున్నట్లు ఆలమూరు పశుసంవర్ధకశాఖ ఏడీ ఎల్.అనిత అన్నారు. స్థానిక ఏడీ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మినీ గోకులాలకు సంబంధించి అందిన 74 దరఖాస్తులను ఎన్ఆర్‌జీఎస్ అధికారులకు పంపించామన్నారు. 2018లో ప్రారంభమైన ఈ పథకానికి అప్పట్లో అర్హులైన వారందరికీ 44 మినీ గోకులాలను నిర్మించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ ఈ ఏడాది ఆగస్టులో మినీ గోకులం పథకం పునః ప్రారంభించిందన్నారు. ఇప్పటికే మండలానికి 50 వరకు మినీ గోకులాల కేటాయింపు జరిగిందన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి పాడి పశువులున్న రైతులకే ఈ మినీ గోకులాలను కేటాయిస్తున్నామన్నారు. మిగిలిన దరఖాస్తుదారులకు కూడా త్వరితగతిన మినీ గోకులాల కేటాయింపునకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఏడీ అనిత పేర్కొన్నారు.

వీణాపాణికి జేజేలు..

- చదువుల తల్లి సరస్వతీదేవిగా అమ్మవార్ల అలంకరణ
- గ్రామగ్రామానా సరస్వతీ పూజలు
- అక్షరాభ్యాసాలు, పూజలకు చిన్నారుల హాజరు



అంబాజీపేటలో సరస్వతీదేవిగా వాసవీ మాత



ఉచ్చిలిలో సరస్వతీదేవిగా విజయకనకదుర్గ



రామేశ్వరంలో సరస్వతీ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

కొత్తపేట: 'సరస్వతీ నమస్తుభ్యం' అంటూ ఆ చదువుల తల్లి సరస్వతీదేవికి విద్యార్థులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా సమస్త చదువులనూ కటాక్షించే సరస్వతీదేవిగా పలు ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించగా భక్తులకు దర్శనమిచ్చారు. సరస్వతీ పూజలు ఎంతో వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తరలి రావడంతో అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. స్థానిక బొరుసువారి సావరంలో వేంచేసిన విజయకనకదుర్గదేవి ఆలయం భక్తులు, విద్యార్థులతో కిటకిటలాడింది. అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో సామూహిక పూజలు చేయించారు. వాడపాలెం జ్ఞానసరస్వతీదేవి అమ్మవారిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు దొంతుకుర్తి రామచంద్రశర్మ అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. అత్యధిక సంఖ్యలో తరలివచ్చిన విద్యార్థులతో సరస్వతీ పూజ చేయించారు. అలాగే పలు ఆలయాల్లో అమ్మవార్లను సరస్వతీదేవిగా అలంకరించారు.

పాల్గొన్న ఎమ్మెల్యే

సఖినేటిపల్లి: మండలంలోని రామేశ్వరం కాలువరేవు సెంటర్లో బుధవారం దేవీ నవరాత్రుల సందర్భంగా సరస్వతి అమ్మవారుగా దర్శనమిచ్చిన దుర్గామాత పూజలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పాల్గొన్నారు. అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. పూజలో పాల్గొన్న పిల్లలకు పుస్తకాలు, పెన్నులు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఏపీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ జి.పెదకాపు, ముప్పర్తి నాని, గెడ్డం మహాలక్ష్మి ప్రసాద్ పాల్గొన్నారు. అంతర్వేదికర గ్రామంలో భవానీ సెంటర్‌లో చిన్నారులు సరస్వతి పూజలు చేశారు. స్థానిక వర్తక సంఘం, పురజనుల ఆధ్వర్యంలో దేవీ నవరాత్రులు నిర్వహిస్తున్నారు.

అంబాజీపేట: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు బుధవారం సరస్వతిదేవిగా ప్రత్యేకంగా అలంకరించడంతో భక్తులకు కనువిందు చేశారు. ఇటికాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద, అంబాజీపేట పశువుల మార్కెట్‌లోను సరస్వతీ దేవి పూజలు నిర్వహించారు. వీణా శ్యామలంబ సమేత చంద్రశేఖర స్వామిని నెమలి వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

ఆత్రేయపురం: మండలంలోని గ్రామాల్లో శరన్నవరాత్ర మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. వాడపల్లి విజయ దుర్గాభవానీ ఆలయం వద్ద సరస్వతి పూజలు నిర్వహించారు.

మామిడికుదురు: దసరా ఏడో రోజు బుధవారం అమ్మవారి మూలా నక్షత్రం కావడంతో సరస్వతీ పూజ ఘనంగా నిర్వహించారు. సరస్వతీ పూజలో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులతో అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అప్పనపల్లి గ్రామ దేవత కనకమహాలక్ష్మమ్మ ఆలయంలో చైర్మన్ తులా నాగరాజు ఆధ్వర్యంలో సరస్వతీ పూజ ఘనంగా జరిపించారు. పలు గ్రామాల్లో సరస్వతీ పూజ ఘనంగా నిర్వహించారు.

పి.గన్నవరం: దసరా మహోత్సవాల్లో భాగంగా పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెంలో కనకదుర్గమ్మ ఆలయం వద్ద బుధవారం విద్యార్థులు సామూహిక సరస్వతీ దేవి పూజలు నిర్వహించారు. అర్చకస్వామి పుల్లేటికుర్తి ఫణి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. పరిశర గ్రామాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ నాయకులు భక్తులకు అన్న సమారాధన చేశారు. విద్యార్థులకు అట్టలు పంపిణీ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మలికిపురం: మండలంలోని గొల్లపాలెంలో బుధవారం సరస్వతీ పూజలు అత్యంత ఘనంగా నిర్వహించారు. దేవీ నవరాత్రుల నేపథ్యంలో జరిగిన ఈ పూజలలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దసరా సందర్భంగా పలు చోట్ల అన్నదానాలు కూడా నిర్వహించారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం చదువుల తల్లి శ్రీసరస్వతి దేవి అమ్మవారి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా దేవి మండపాల్లో విద్యార్థులు పెన్నులు, పుస్తకాలతో పూజలను నిర్వహించారు. అనంతరం ఆయా మండపాల్లోని నెలకొల్పి అమ్మవారిని దర్శించుకున్న ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడిలో కొలువైన రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి మంగళవారం ప్రత్యేక కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు శ్రీకంఠం చక్రవర్తి ఆధ్వర్యంలో రాజేశ్వరీదేవి అమ్మవారికి సాముహిక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.



తాటికాయలవారిపాలెంలో సరస్వతీ పూజలు చేస్తున్న విద్యార్థులు



పాశర్లపూడి కనకదుర్గ ఆలయంలో సరస్వతీ పూజల్లో పాల్గొన్న విద్యార్థులు



గొల్లపాలెంలో సరస్వతీ పూజలు చేస్తున్న విద్యార్థులు



అంతర్వేదికరలో సరస్వతీ పూజ చేస్తున్న చిన్నారులు

14న నరేంద్రపురంలో జాబ్‌మేళా

పి.గన్నవరం: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పి.గన్నవరం మండలం నరేంద్రపురం గురుకుల పాఠశాల వద్ద ఈనెల 14వ తేదీ ఉదయం 10.30 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారిణి ఈ.వసంతలక్ష్మి తెలిపారు. అపోలో ఫార్మసీ లిమిటెడ్ కంపెనీలో ఫార్మసిస్ట్, ఫార్మసిస్ట్ అసిస్టెంట్, రిటైల్ ట్రెనీ అసోసియేట్, ఎల్ఐసీ కంపెనీలో అడ్వైజర్, క్రెడ్ రైట్ ఫైనాన్స్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఈ జాబ్‌మేళాలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. వివరాల కోసం సెల్ 8247645389 నంబర్‌కు సంప్రదించాలని ఆమె సూచించారు.

వచన కవితల పోటీకి ఆహ్వానం

అంబాజీపేట: స్థానిక అరిగెల బలరామమూర్తి సాహిత్య కళావేదిక ద్వితీయ వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది నవంబర్ నెలలో వచన కవిత పోటీలు నిర్వహించనున్నట్లు ఆహ్వాన కమిటీ తెలిపింది. కవితల పోటీ అంశాలకు సంబంధించి పర్యావరణ పరిరక్షణ పర్యావరణ సమతుల్యతపై 20 నుంచి 25 పంక్తులకు మించని వచన కవిత రాసి పంపాలన్నారు. ఈ నెల 30వ తేదీలోగా కవితలను స్వీకరిస్తామన్నారు. ఎంపిక చేయబడిన కవితకు రూ.5 వేల నగదు బహుమతితో పాటు మెమెంటో, కవి సత్కారం జరుగుతుందన్నారు. కవితలను అరిగెల బలరామమూర్తి సాహిత్య కళావేదిక, ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఎదురుగా, అంబాజీపేట అనే చిరునామాకు పంపాలన్నారు. కవితలు వారి సొంత రచన అనియు, దీనికి అనువాదం గానీ, కాపీ కాదని హామీ పత్రం కవితతో పాటు విడిగా జతపరచవలసి ఉంటుందని ఆహ్వాన కమిటీ సభ్యులు తదితరులు తెలిపారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

అంబాజీపేట: రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి(ఏవో) సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. మాచవరం, నందంపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ జీవ ఎరువులు వాటి ఉపయోగం, వ్యవసాయ శాఖలో అమలవుతున్న పథకాల గురించి రైతులకు వివరించారు. ఉద్యానశాఖ ఏఈఓ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొబ్బరిచెట్లకు ఆశించిన తెల్లదోమను అరికట్టేందుకు రైతులంతా సామూహిక చర్యలు చేపట్టాలన్నారు. తెల్లదోమ నివారణకు బదనికలతోనే సాధ్యమవుతుందన్నారు. కొబ్బరి మొక్కలు, చెట్లు పిడుగుపాటు, తెగుళ్ల వల్ల చనిపోతే ఆ చెట్లను తొలగించాలన్నారు. వాటి స్థానే కొత్త మొక్కలు వేసుకునేందుకు రాయితీలు ఇస్తున్నామన్నారు. ప్యాక్‌హౌస్ కొబ్బరి నిల్వ చేసుకోవడానికి సుమారుగా రూ.2 లక్షలు వరకు రాయితీ వస్తుందన్నారు. కూరపాదులు, పందిరి ఏర్పాటుకు రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ల పరిశీలన

ఆత్రేయపురం: మండలంలోని ఆత్రేయపురం, అంకంపాలెం గ్రామాల్లో ఇసుక రీచ్‌లను బుధవారం ఆర్‌డీవో శ్రీకర్, తహసీల్దార్ రాజేశ్వరరావు పరిశీలించారు. ర్యాంపులో ఇసుక తవ్వకాలు నిర్వహించేందుకు గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే సర్వేయర్ ప్రభావతి, రామకృష్ణ, ఆర్ఐ భవానీ, వీఆర్ఓ జ్యోతిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

గొల్లపల్లి పరామర్శ



ఉయ్యూరువారి మెరకలో సుజాత కుటుంబ సభ్యులను పరామర్శించిన గొల్లపల్లి

సఖినేటిపల్లి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కేశవదాసుపాలెం జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం సుజాత కుటుంబ సభ్యులను బుధవారం రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు పరామర్శించారు. ఈ మేరకు ఉయ్యూరువారి మెరకలో సుజాత చిత్రపటం వద్ద ఆయన నివాళులర్పించారు. ఆమె భర్త రాజును, కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంట ఎంపీటీసీ గుబ్బల అంజి, కారుపర్తి భాస్కర నాగేశ్వరరావు, తాడి సహదేవ్, టీచర్లు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ బాధిత విద్యార్థికి పరామర్శ

సఖినేటిపల్లి: మండలంలోని గొందిలో ఇటీవల కరెంటు షాక్‌తో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న బర్రే దుర్గాభవానీని బుధవారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పరామర్శించారు. ఈ మేరకు బాధిత విద్యార్థిని ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే, ప్రభుత్వ పరంగా పూర్తి అండగా ఉంటానని భవానీ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, భరోసా ఇచ్చారు. వెంట సర్పంచ్ డి.రవికుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పి.గన్నవరం: మండలంలోని పెదకందాలపాలెం గ్రామం వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. బుధవారం తెల్లవారుజామున ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. ట్రాక్టర్ ఓనర్ ప్రసన్నకుమార్‌పై కేసు నమోదు చేసినట్టు ఆయన వివరించారు.